క్లుప్తంగా

పాఠశాలకు మొక్కల వితరణ



మొక్కలు అందజేసిన దృశ్యం

అమరాపురం: మండల పరిధిలోని కె.శివరం గ్రామ ఉన్నత పాఠశాలకు అదే గ్రామానికి చెందిన జె.క్రిష్ణ 200 మొక్కలను పాఠశాలకు అందజేశారు. దాత క్రిష్ణ రూ.25 వేలు వెచ్చించి వివిధ రకాలైన పండ్లు, పూలు, షో మొక్కలను తీసుకొచ్చి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి వాటిని కాపాడు కోవాలని ఉపాధ్యాయులు, విద్యార్థులను కోరారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

రొళ్ల: మండలంలోని హొట్టేబెట్ట సచివాలయం పరిధిలో కొడగార్లగుట్ట, కొడగార్లగుట్ట కాలనీ గ్రామాల్లో మంగళవారం ఉదయం 8 గంటలకు ఎమ్మెల్యే తిప్పేస్వామి ఆధ్వర్యంలో 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కల్లుమడి ఆజాద్ తెలిపారు.

గోరంట్ల: మండలంలోని పుట్టగుండ్లపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని బూచేపల్లి, కొత్తపల్లి, పుట్టగుండ్లపల్లి, పుట్టగుండ్లపల్లి ఎస్సీకాలనీల్లో మంగళవారం ఎమ్మెల్యే శంకరనారాయణ ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రఘునాథగుప్తా తెలిపారు. బూచేపల్లిలో ఉదయం 8 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

జిల్లా ప్లీనరీని జయప్రదం చేయండి



కరపత్రాలను విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

హిందూపురం టౌన్: కదిరిలో ఈ నెల 24, 25న జరగనున్న ఎస్ఎఫ్ఐ 5వ జిల్లా ప్లీనరీ సమావేశాలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం పట్టణంలో ప్లీనరీ సమావేశాల కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు చంద్రశేఖర్, హర్షకుమార్, రంగ, బాబా ఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

అగళి : స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం 10 గంటలకు మండల సర్వసభ్య సమావేశన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నరేంద్ర కుమార్, ఎంపీపీ రేణుక తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలని కోరారు.


చెరువు స్థలం కబ్జాకు యత్నం



చెరువులో గడ్డికి మంట పెట్టిన దృశ్యం

హిందూపురం అర్బన్: పట్టణానికి ఆనుకొని ఉన్న కొట్నూరు చెరువు ఇప్పటికే నలు వైపులా కబ్జాలకు గురైంది. ప్రస్తుతం చెరువులోకి నీళ్లు రావడంతో గడ్డి బాగా పెరిగింది. ఎంపీడీఓ కార్యాలయం ఎదురుగా కొట్నూరు చెరువులో గడ్డికి అగ్గి పెట్టి కొందరు ఆ స్థలాన్ని సొంతం చేసుకునేలా శుభ్రం చేయిస్తున్నారు. ఒకేరోజు శుభ్రం చేస్తే అనుమానం వస్తుందని వారంలో ఓ సారి మంటలు వేయడం ద్వారా కొంత కొంత శుభ్రం చేస్తున్నారు. ఇప్పటికే కొట్నూరు చెరువుకు సంబంధించిన 10 ఎకరాల భూమిని ఆక్రమించి ఇళ్లు నిర్మించుకున్నారు. ఇప్పుడు మళ్లీ ఆక్రమణలకు కొందరు ప్రయత్నిస్తున్నారు.

పావగడను కరువు ప్రాంతంగా ప్రకటించాలి



జేడీఎస్ నూతన పదాధికారులను అభినందిస్తున్న దృశ్యం

పావగడ: 'తీవ్ర వర్షాభావంతో తాలూకా వ్యాప్తంగా కరువు కాటకాలు అలము కున్నాయి. తాగునీటికి సైతం ఇబ్బందులు పడే పరిస్థితి ఉంది. వెంటనే పావగడను కరువు ప్రాంతంగా ప్రకటించాలి' అని స్థానిక జేడీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆర్సి అంజినప్ప ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఎమ్మెల్యే వెంకటేశ్‌కు సూచించారు. స్థానిక ఎస్ఎస్‌కే రంగ మందిరంలో సోమవారం నిర్వహించిన జేడీఎస్ కార్యకర్తల సభలో ఆయన పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్ప మాట్లాడుతూ ఎమ్మెల్యే వెంకటేశ్ ద్వేష పూరిత రాజకీయాలు చేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం జేడీఎస్ తాలూకా, హోబళి స్థాయి పదాధికారుల నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. తాలూకా జేడీఎస్ నూతన అధ్యక్షుడిగా ఎస్ఏ ఈరణ్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ప్రజా సంక్షేమ సారథి జగనన్న



మాట్లాడుతున్న హిందూపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక



హాజరైన జేసీఎస్ కన్వీనర్లు, గృహసారథులు

• హిందూపురం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దీపిక

హిందూపురం: రాష్ట్ర చరిత్రలో ఎన్నాడూ లేని విధంగా ప్రతి కుటుంబానికి రూ.7.50 లక్షల వరకూ లబ్ధి చేకూర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని హిందూపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక అన్నారు. పట్టణంలోని ఆర్‌కె ఫంక్షన్‌హాల్‌లో జేసీఎస్ కన్వీనర్లు శివశంకర్‌రెడ్డి, గిరీష్ అధ్యక్షతన నియోజకవర్గ జేసీఎస్ కన్వీనర్లు, గృహసారథులకు బీమా ఇన్సూరెన్స్ నమోదుతో పాటు జేసీఎస్ సైన్యం యాప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశానికి సమన్వయకర్త టీఎన్ దీపిక ముఖ్యఅతిథిగా విచ్చేశారు. మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘనీ, మున్సిపల్ వైస్‌చైర్మన్ బలరామిరెడ్డి, చిలమత్తూరు ఎంపీపీ పురుషోత్తంరెడ్డి, వైస్‌ఎంపీపీ అంజన్‌రెడ్డి, జెడ్పీటీసీ శ్రీనివాసరెడ్డి కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు.

సంతోషంగా ఆహ్వానిస్తున్నారు

ఈ సందర్భంగా సమన్వయకర్త దీపిక మాట్లాడుతూ సీఎం జగనన్న పాలనలో సంక్షేమ ఫలాలు ఇంటి వద్దకే చేరుతున్నాయన్నారు. గడప గడపకూ కార్యక్రమానికి వెళ్లినప్పుడు ప్రజలు ఆప్యాయంగా పలకరిస్తూ ఇంట్లోకి ఆహ్వానించి జగనన్న పాలనలో తాము అన్నిరకాలుగా లబ్ధి పొందుతున్నామని హర్షం వ్యక్తం చేస్తున్నట్లు చెప్పారు. కరోనా లాంటి అడ్డంకులు వచ్చినా ప్రజలకు ఇచ్చిన మాట తప్పకుండా సంక్షేమ పథకాలను వర్తింపజేశారని చెప్పారు. కరోనా కష్ట కాలంలో ప్రజలను కన్నబిడ్డల్లా కాపాకోవడం జగనన్నకే సాధ్యమైందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆధ్వర్యంలో జరుగుతున్న మంచి కార్యక్రమాల వల్లే జేసీఎస్ కన్వీనర్లు, గృహసారథును ప్రజలు తమ ఇంటి సభ్యుల్లాగా ఆదరిస్తున్నారని చెప్పారు. ప్రతి కుటుంబానికి, ప్రతి వ్యక్తికి ప్రభుత్వం అందిస్తున్న లబ్ధి నేరుగా చేరాలని, ఇందులో ఏదైనా ఇబ్బంది కల్గితే వెంటనే వారధుల్లా నిలిచి సమస్యను పరిష్కరించడంలో చొరవ చూపుతూ సేవలు అందిస్తున్న గృహసారథులు అభినందనీయులు అన్నారు.

ఆరోగ్య భద్రత కల్పించడానికే...

గత టీడీపీ పాలనలో ఒక్క రేషన్‌కార్డు కావాలన్నా , ప్రభుత్వ లబ్ధి అందుకోవాలన్నా అధికారులు, పచ్చనేతల చుట్టూ ప్రదక్షిణలు చేసే పరిస్థితి ఉండేదని సమన్వయకర్త దీపిక విమర్శించారు. ఆ పరిస్థితులకు స్వస్తి పలికి ప్రజల ఇంటి ముంగిటలకే సంక్షేమ లబ్ధి అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. ఇదే రీతిలో ప్రజల కష్టాల్లో పాలుపంచుకుంటున్న జేసీఎస్ సభ్యులకు ఆరోగ్యభద్రత కల్పించడానికి ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించడం హర్షణీయమన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వేణురెడ్డి, బాబురెడ్డి, డైరెక్టర్లు లక్ష్మీనారాయణ, జనార్దన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు శ్రీరాంరెడ్డి, నారాయణస్వామి, కౌన్సిలర్లు మారుతీరెడ్డి, జయరాముడు, షాజియా,మల్లికార్జున,నాయకులు బసిరెడ్డి,సాదిక్, ఖలీల్, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం



రొళ్ల : హొట్టేబెట్టలో గడప గడపకూ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

• ఎమ్మెల్యే తిప్పేస్వామి

రొళ్ల: రాష్ట్రంలో అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే తిప్పేస్వామి పేర్కొన్నారు. సోమవారం మండలలోని హొట్టేబెట్ట సచివాలయం పరిధిలోని హొట్టేబెట్ట, కల్లురొప్పం, కె.గొల్లహట్టి గ్రామాల్లో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. ఎమ్మెల్యే తిప్పేస్వామి మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల వారికి సకాలంలో సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. గత టీడీపీ ప్రభుత్వ పాలనలో జన్మభూమి కమిటీల పేరుతో నాయకులు, కార్యకర్తలు దాచుకో..దోచుకో..పంచుకో అన్న రీతిలో పాలన సాగిందని విమర్శించారు. చంద్రబాబుతో పాటు ఆయన దత్తపుత్రుడు పవన్ కళ్యాణ్, కుమారుడు లోకేష్ ఎన్ని యాత్రలు చేసిన కూడా రాష్ట్రంలో ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. సంక్షేమ పథకాలు తిరిగి యథావిధిగా కొనసాగాలంటే మళ్లీ వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. తర్వాత హొట్టేబెట్ట జిల్లా పరిషత్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. అనంతరం హొట్టేబెట్ట, కల్లురొప్పం గ్రామాల్లో డ్రైనేజీ ఏర్పాటు, విద్యుత్ స్థంబాలు మార్పు, మంచినీటి కొళాయిలు ఏర్పాటు చేయాలని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సంబంధితశాఖ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రత్నమ్మ, జేసీఎస్ కన్వీనర్ నాగేంద్ర, ఎస్సీ సెల్ కన్వీనర్ ఆంజినేయులు, సింగిల్ విండో అధ్యక్షుడు మోతిరాంనాయక్, మార్కెట్ యార్డు డైరెక్టర్ శ్రీనివాస్, సర్పంచులు సదాశివప్ప, చిన్నరంగప్ప, నరసింహప్ప, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు సంతోష్, కోఆప్షన్ మెంబర్ అల్లాబకాష్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డు కమిటీ సభ్యులకు సన్మానం



మార్కెట్ యార్డు చైర్మన్, డైరెక్టర్, మెంబర్లను సన్మానిస్తున్న దృశ్యం

పరిగి: ఇటీవల పెనుకొండ మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్‌గా కలిపి శ్రీనివాసులు, ట్రేడర్స్ యూనియన్ డైరెక్టర్‌గా ఊటుకూరు నరేంద్రరెడ్డి, యార్డు కమిటీ మెంబర్లుగా ఎంపికైన హసీనాబేగం , నేతులపల్లి ప్రభాకర్‌ను సోమవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. స్థానిక ఎంపీపీ కార్యాలయంలో ఎంపీపీ సవిత, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి డీవీ రమణ, జిల్లా కార్యదర్శి ప్రభాకర్, మండల కన్వీనర్ నరసింహమూర్తి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతాంగాన్ని అన్ని విధాలా అండగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో కాణిపాకం ఆలయ ట్రస్టు డైరెక్టర్ మారుతీస్వామి, సింగల్ విండో అధ్యక్షుడు మారుతీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదు చేయించుకోండి



పంట నమోదు చేస్తున్న దృశ్యం

అగళి: మండలంలోని రైతులు సాగు చేసిన పంటలను నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి శేఖర్ నాయక్ సూచించారు. సోమవారం మండల పరిధిలోని రావుడి పంచాయతీలోని ఆలుడి గ్రామంలో పంట నమోదు కార్యక్రమం నిర్వహించారు.

పశువైద్యశాలను సందర్శించిన డీడీ



సిబ్బందితో సమావేశమైన డీడీ పెంచలయ్య

లేపాక్షి: మండల కేంద్రమైన లేపాక్షిలోని ఏరియా పశువైద్యశాలను పశుసంవర్ధక శాఖ ఉప సంచాలకులు డాక్టర్ పెంచలయ్య సోమవారం సందర్శించారు. జగనన్న పాలవెల్లువలోని మహిళా డెయిరీ సమాఖ్య కింద జరుగుతున్న రైతు నమోదు ప్రక్రియను సమీక్షించారు. కార్యక్రమంలో సహాయ సంచాలకులు డాక్టర్ మోహన్‌రావు, డాక్టర్లు శివశంకరనాయక్, కిషోర్, జయశ్రీ పాల్గొన్నారు.

పిల్లలందరూ బడుల్లో ఉండాలి

గుడిబండ: బడిమానేసిన పిల్లలందరూ తిరిగి పాఠశాలల్లో ఉండాలని ఎంఈఓ రవిచంద్రకుమార్ సూచించారు. సోమవారం మండల పరిధిలోని జవనదుకు, రామయ్యనహట్టి గ్రామాల్లో జీఈఆర్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ బడిమానేసిన విద్యార్థులందరినీ పాఠశాలల్లో చేర్పించాలన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

సోమందేపల్లి: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ అవార్డు పొందిన తహసీల్దార్ సురేష్‌కుమార్‌ను మండల అధికారులు సోమవారం ఘనంగా సన్మానించారు. తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శాలువా కప్పి పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఎంఈఓ ఆంజనేయులు నాయక్, ఏపీఎం రామాంజినేయులు పాల్గొన్నారు.

భూవివాదాలకు చెక్



సరిహద్దు రాళ్లు పాతిస్తున్న అధికారులు

పరిగి: రైతుల భూవివాదాలకు చెక్ పెట్టేందుకే జగనన్న భూ హక్కు, భూరక్ష కార్యక్రమం ప్రభుత్వం ప్రవేశపెట్టిందని తహసీల్దార్ సౌజన్య లక్ష్మీ తెలిపారు. సోమవారం మండలంలోని ఊటుకూరు పంచాయతీ పరిధిలోని సంగమేశ్వరంపల్లిలో ఇటీవల నిర్వహించిన రీసర్వే పనులు పూర్తవడంతో సర్వే సరిహద్దు రాళ్లను పాతిపెట్టే కార్యకమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ దిలీప్ యాదవ్, ఆర్ఐ శోభ, సెక్రెటరీ తిప్పన్న, స్థానిక రైతులు, రెవెన్యూశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి

నల్లచెరువు: మండల పరిధిలోని దామవాండ్లపల్లి గ్రామంలో జయరాం అనే వ్యక్తిపై దాడి చేసిన ఇద్దరిపై సోమవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు దామవాండ్లపల్లికి చెందిన జయరాంపై అదే గ్రామానికి చెందిన గణేష్, గంగరాజు కర్రలు, ఇటుకలతో తలపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. స్థానికులు గమనించి జయరాంను కదిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. బాధితుడి భార్య సరస్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

నేటి నుంచి ఆధార్ వారోత్సవాలు

చిలమత్తూరు: ఆధార్ వారోత్సవాలను మంగళవారం నుంచి 25 వరకూ నాలుగు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నరేష్‌కృష్ణ పేర్కొన్నారు. 22న కొడికొండ, 23న దేమకేతేపల్లి, 24న చాగలేరు, 25న చిలమత్తూరు-3లో ఆధార్ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు..ఆధార్ అప్‌డేషన్ , బయోమెట్రిక్, ఆధార్ ప్రింట్ ఇంకా ఆధార్ సంబంధిత సేవలన్నీ అందుబాటులో ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

'కంది' సాగుపై రైతుల ఆసక్తి



రొద్దం సమీపంలో సాగైన కంది పంట

రొద్దం: ఈ ఏడాది వర్షాలు సకాలంలో పడకపోవడంతో మండల రైతులు కంది పంట సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ప్రధాన పంట వేరుశనగ సాగు చేయడానికి వర్షాభావ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో కంది, ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు దృష్టిసారించారు. మండలంలో ప్రధాన పంటగా వేరుశనగ సాగు చేసేవారు. గతంలో 2 వేల ఎకరాల్లో వేరుశనగ పంట వేసేవారు. ఈ ఏడాది వేరుశనగ విస్తీర్ణం బాగా తగ్గిపోయింది. ఇప్పటికే మండల వ్యాప్తంగా 4 వేల ఎకరాల్లో కంది పంట సాగు చేసినట్లు ఏఓ నివేదిత తెలిపారు. ప్రభుత్వం ఉలువలు సరఫరా చేస్తోందని రైతులు ఉలువలు సాగు చేయడానికి ముందుకు వస్తున్నట్లు వివరించారు. కొందరు రైతులు 1800 ఎకరాల్లో పత్తి, 2500 ఎకరాల్లో మొక్క జొన్న పంట సాగు చేశారు.

లక్ష్మీనరసింహునికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో భక్తరహళ్లి లక్ష్మీనరసింహస్వామి

మడకశిరరూరల్: మండలంలోని పలు ఆలయాల్లో తొలి శ్రావణ సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తరహళ్లి లక్ష్మీనరసింహస్వామి, జిల్లెడుగుంట ఆంజనేయస్వామి , నీలకంఠేశ్వరస్వామి, కల్లుమర్రి వీరకేతమ్మ, చందకచర్ల ఆంజనేయస్వామి, జమ్మానిపల్లి నిడిమామిడమ్మ తదితర ఆలయాల్లో స్వామివార్లకు భక్తులు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

గ్రామ దేవతలకు పూజలు

అమరాపురం: మండలంలోని తమ్మడేపల్లిలో వెలసిన ఆంజనేయస్వామి, బొమ్మలింగేశ్వర స్వామి, మైలారలింగేశ్వరస్వామి, ఈశ్వర స్వామి, గంగమ్మ తదితర దేవతలకు సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా స్థానిక ఈశ్వరాలయం, గంగమ్మ తల్లికి ప్రత్యేకంగా పూజలు చేశారు. సాయంకాలం గ్రామంలోని దేవతలను ప్రత్యేకంగా అలంకరించి గ్రామ వీధుల గుండా ఊరేగింపుగా చెరువు కట్ట వద్దకు తీసుకెళ్లి పూజలు చేశారు. అనంతరం వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు.

గృహజ్యోతి యోజన ప్రారంభం



గృహజ్యోతి యోజన ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్

పావగడ: రాష్ట్రంలో సీఎం సిద్ధరామయ్య ప్రభుత్వం అభివృద్ధి దిశగా సాగుతోందని, ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలు ఒక్కొక్కటీ నెరవేరుస్తోందని ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ తెలిపారు. స్థానిక ఎస్ఎస్‌కే సముదాయ భవనంలో సోమవారం నిర్వహించిన గృహ జ్యోతి యోజన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నేటి నుంచి గృహ జ్యోతి యోజనతో ప్రతి నెలా ఎలాంటి బిల్లు చెల్లించకుండా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ప్రతి ఇంటికీ సరఫరా చేస్తామన్నారు. తిరుమణి సోలార్ పార్క్‌ను 10 వేల ఎకరాల్లో విస్తరించి అదనంగా మరో వెయ్యి మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పాదన సాధించేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం



నవీన్‌కుమార్

రొద్దం: మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లికి చెందిన నవీన్‌కుమార్ అనే యువకుడు సోమవారం పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఎస్ఐ నాగస్వామి వివరాల మేరకు... నవీన్‌కుమార్ ఓ అమ్మాయిని ప్రేమించాడన్నారు. అయితే ప్రేమించిన అమ్మాయి తనను మోసం చేసి మరో వ్యక్తితో తిరుగుతోందని, దీంతో తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సోషల్ మీడియాలో పోస్టు పెట్టాడన్నారు. కోగిరి - కంబాలపల్లి గ్రామాల మధ్య పొలాల్లో పురుగుల మందు సేవించినట్లు తెలిపారు. అపస్మారక స్థితిలో ఉన్న నవీన్‌ను అనంతపురం ఆస్పత్రికి తరలించినట్లు వివరించారు. ఇదిలా ఉంటే నవీన్.. ఐ-టీడీపీలో పనిచేస్తున్నారు.

ఎస్పీని కలిసిన చలివెందుల సర్పంచ్



ఎస్పీని కలిసిన చలివెందుల సర్పంచ్ ఉపేంద్రకుమార్‌రెడ్డి, నాయకులు

హిందూపురం: మండలంలోని చలివెందుల గ్రామ పంచాయతీ ఉప ఎన్నికల్లో సర్పంచ్‌గా గెలుపొందిన ఉపేంద్రకుమార్‌రెడ్డి సోమవారం ఎస్పీ మాధవరెడ్డిని కలిశారు. పుట్టపర్తిలోని జిల్లా ఎస్పీ కార్యాలయానికి తరలివెళ్లి పుష్పగుచ్ఛం అందించారు. ఇటీవల జరిగిన ఉప ఎన్నికల్లో పోలీసులు బందోబస్తు నిర్వహించి శాంతియుతంగా ఎన్నికలు నిర్వహించేందుకు సహకరించడం హర్షణీయమన్నారు. బందోబస్తు పర్యవేక్షించిన వారందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న కర్ణాటక మద్యాన్ని చూపుతున్న పోలీసులు

గోరంట్ల: కర్ణాటక మద్యాన్ని వేర్వేరుగా తరలిస్తున్న ఇద్దరిని సోమవారం అరెస్టు చేసినట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు... మండల పరిధిలోని మీషన్ తండాకు చెందిన జయరాంనాయక్ అనే వ్యక్తి కర్ణాటక మద్యాన్ని తరలిస్తుండగా పులేరు శివారులో అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. అతని వద్ద నుంచి 130 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే మల్లాపల్లికి చెందిన బూచేపల్లి మహమ్మద్ అనే వ్యక్తి ఇంటిపై దాడులు చేయగా 93 టెట్రా ప్యాకెట్లు లభించాయన్నారు. ఇద్దరిని పెనుకొండ కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించారన్నారు.

వ్యక్తికి గాయాలు

గోరంట్ల: మండల పరిధిలోని కదిరి - హిందూపురం ప్రధాన రహదారిపై జీనవాండ్లపల్లి సమీపంలో సోమవారం రాత్రి ఆటో - ద్విచక్ర వాహనం ఢీ కొన్నాయి. ఈ ఘటనలో ద్విచక్ర వాహనం నడుపుతున్న మల్లెల గ్రామానికి చెందిన రంగప్ప తీవ్రంగా గాయపడినట్లు పోలీసులు తెలిపారు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

సర్వసభ్య సమావేశానికి అధికారుల డుమ్మా



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ చంద్రశేఖర్

• ఆగ్రహం వ్యక్తం చేసిన ప్రజాప్రతినిధులు

రొద్దం: మండల సర్వ సభ్య సమావేశానికి పలు శాఖల అధికారులు డుమ్మా కొట్టడంతో సర్పంచులు, ఎంపీటీసీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు హాజరు కానప్పుడు సమావేశం ఎందుకు నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. సోమవారం స్థానిక వైకేపీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు పైగేరి చంద్రశేఖర్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశం ప్రారంభం కాకముందే సర్పంచులు సమావేశాన్ని బహిష్కరించారు. 14, 15 ఆర్థిక సంఘం నిధులు మంజూరులో జాప్యంపై సర్పంచులు నిరసన తెలిపారు. అనంతరం సమావేశానికి హాజరయ్యారు. సభ్యులు మాట్లాడుతూ గ్రామ సచివాలయాల్లో సిబ్బంది పనితీరు బాగాలేదన్నారు. విధి నిర్వహణలో అలత్యం వహిస్తున్నారని మండిపడ్డారు. ప్రజాప్రతినిధులకు కనీస గౌరవం ఇవ్వడం లేదని వాపోయారు. ఈ సందర్భంగా పలు శాఖల సమస్యలపై సమావేశంలో చర్చించారు. ఎంపీపీ చంద్రశేఖర్ మాట్లాడుతూ సమావేశానికి హాజరు కాని అధికారులపై జిల్లా కలెక్టర్‌కు నివేదికలు పంపాలని ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్ కోరారు. సభలో సభ్యులు లేవనెత్తిన సమస్యలపై సంబంధిత అధికారులు ప్రణాళికలు తయారు చేయాలని తెలియచేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనంతచారి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, పలుశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

దళితులకు న్యాయం చేయండయ్యా..

లేపాక్షి: మండలంలోని మామిడిమాకుపల్లిలో ఇంటి స్థలాలకు కేటాయించిన భూమిని కొందరు ఆక్రమించారని, ఆ భూమిని తమకే దక్కేలా చేసి న్యాయం చేయాలని సోమవారం తహసీల్దార్ బాబుకు ఆ గ్రామానికి చెందిన దళితులు వినతిపత్రం సమర్పించారు. సర్వేనెంబర్ 138-18, 138-19లో 1.60 ఎకరాల భూమిని ప్రభుత్వం ఎస్సీలకు కేటాయించారన్నారు. దళితులు శ్మశాన వాటికకు వెళ్లాలంటే ఈ భూమిలో నుంచే వెళ్లాలని, ఎస్సీలకు కేటాయించిన భూమికి పట్టా కూడా తెచ్చుకున్నారని తెలిపారు. ఆక్రమణదారుల నుంచి ఆ భూమిని ఎస్సీలకు దక్కేలా చూడాలని కోరారు.

ఇరువర్గాల ఘర్షణ

గోరంట్ల: మండలంలోని బూదిలి గ్రామ పంచాయతీ పరిధిలోని చన్నారప్పల్లిలో సోమవారం సాయంత్రం భూవివాదం నేపథ్యంలో ఇరువర్గాలు ఘర్షణ పడ్డాయి. గంగులప్ప అనే వ్యక్తి తన పొలానికి కంచె వేయడానికి రాళ్లు తరలిస్తుండగా గొల్లపల్లి గ్రామానికి చెందిన వారు అడ్డుకోగా ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఓ వ్యక్తి కొడవలితో గంగులప్పపై దాడి చేసి గాయపరిచినట్లు తెలుస్తోంది. గాయపడిన గంగులప్పను హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు బాధితుని బంధువులు తెలిపారు.